
# అనూరాధ డైరీ



**ఫిబ్రవరి 19 - సోమవారం:**

సంక్రాంతి శెలవులు, స్ట్రయిక్ శెలవులు అయిన తరువాత ఇవాళే కాలేజీ తెరిచారు. వైదేహీ, సరోజ, సునంద -- నిర్మల... అంతా వచ్చేరు. క్లాసులు మాత్రం జరగలేదు. నిర్మలలో యిన్ని శెలవులు వచ్చినా, ఏమాత్రం ఆనందపు ఛాయలు కనపడటం లేదు. ఎందుకో ఈ వయసులోనే నిర్మలకి అంత వైరాగ్యం--

**22 - గురువారం**

--ప్రభాకర్ అని ఒక కొత్త లెక్చరర్ వచ్చాడు. బాగా కుర్రవాడే. ఇంకా పెళ్ళి అయివుండదు. అందంగా మంచి స్టైయిల్‌గా - రాక్‌హడ్సన్‌లా వున్నాడు. కొద్దిగా భయపడ్డా లెసన్ బాగానే చెప్పాట్ట - అంటే... ఆయన లెసన్ చెబుతుంటే - ఆయన్నే అదేపనిగా చూడటం వల్ల అసలేమీ వినలేదు - కాని ఆయన చాల రిజర్వ్‌డ్ టైప్. వైదేహీ ఆయనకి "బాలయోగి" అని పేరు పెట్టింది. వెర్రిమాలోకం! ఏ రాజ్‌కుమార్ అనో పెట్టక బాలయోగి అంటుందేమిటి? నిర్మల ఇవాళ ఒకటే గాభరాగా వుంది. ఆమెను ఇంత పరధ్యానంగా ఎప్పుడూ చూడలేదు -- ఏమిటో ఆ బాధ? ఒక ళ్ళతో చెప్పదు. అదో రకం--

## 23 - శుక్రవారం

--లాబ్‌లో ప్రభాకర్‌ని పలకరించాను. ఎందుకో ఆయన అదోలా వున్నారు. నన్ను చూడగానే బాగా కంగారుపడిపోయి, "ఏమిటి?" అని అడిగారు వణుకు కంఠంతో కొద్దిగా 'ఆడభయం' వున్నట్టుంది. తరువాత నేనేమి మాట్లాడినా సరిగ్గా జవాబివ్వలేకపోయారు. కాని అదురుతున్న ఆయన పెదవులు--

## 24 - శనివారం

తలంటు పోసుకుని క్లాసుకు వెళ్ళాను. సుబ్రావ్ సన్నగా విజిలేసి 'ఓ! వీనస్ ఆఫ్ వైజాగ్!' అన్నాడు. ఒకసారి అతనే నన్ను 'వాట్ ఎస్టన్నింగ్ బ్యూటీ' అన్నాడు. ఛీ రౌడీమూక! అయినా సుబ్రావ్‌ది మంచిటేస్టే... అంటే తన అందాన్ని మెచ్చుకుంటున్నాడని కాదు... ప్రభాకర్ పాఠం చెబుతుంటే, ఆయన అందమైన జుట్టు నుదురు మీద నాట్యం చేస్తున్నప్పుడు, ఆయన అందంగా తల విదిలించి జుట్టును వెనక్కు తీసుకుంటుంటే -- ఆయన తన కేసి చూసినప్పుడు తను నవ్విన చిన్న దరహాసానికి, గాభరాపడి బోర్డు వేపే తిరిగి పాఠం చెబుతున్నప్పుడు -- బోర్డు తుడుస్తూ ముఖంలో చికాకు కనపర్చేటప్పుడు..... ఆయన అంత అందంగా వుండటానికి కారణం ఏమిటి?.....

## 25 - ఆదివారం

హాస్టల్ అమ్మాయిలందరితో కలసి 'బ్రహ్మచారి'కి వెళ్ళేను, శర్మా, మూర్తి, గిరి వచ్చారు. అంతగా గొడవ చేయకపోయినా - అదోరకం పోజు వాళ్ళది. అసలు తప్పంతా సునందదే. సరోజ చెబుతూనే వున్నది వాళ్ళని విష్ చేయవద్దని. సునంద శర్మని పిలిచి తమ సీట్ల నెంబర్లు చెప్పింది. వాళ్ళూ ప్రక్కనే కూర్చున్నారు. ప్రక్క నెంబర్లు వేయించుకొని.... ఇంట్రవెల్‌లో ప్రభాకర్ కనపడ్డాడు. విష్ చేయగానే - మర్యాదకోసం రిసీవ్ చేసుకొని వెంటనే చకచకా వెళ్ళిపోయాడు... అదేం మనిషబ్బా!........

## 26 - సోమవారం

.... వైదేహి ఏదో పత్రికలో సీరియల్ చదివిందట - అమ్మాయిని ఏడిపించే అబ్బాయిల మీద. ఆ సీరియల్‌ని అన్వయిస్తూ - ఆ పత్రిక్కే ఒక వుత్తరం పంపించింది. వ్రాసిన కథలు పత్రికల్లో పడక పోవడం వల్ల కనీసం ఉత్తరాలు వ్రాసి, పబ్లిష్ అయితే సంతోషించుదామనుకుంటుంది వైదేహి. పిచ్చి మొద్దు:- క్లాసులో ప్రభాకర్ లెసన్ చెబుతూ ఎందుకో కంగారుపడి

పోయాడు. సునంద జోకులు ఆయన్ని మరింత గాభరా పెట్టినాయి. చెమట పట్టిన ఆయన నుదురు - మనోహరంగా వుంది.... నిర్మల కళ్ళల్లో ఎందుకో నీళ్లు తిరిగినాయి! ఎవరితోనన్నా చెబుతుందా ఏమన్నానా....

## 27 - మంగళవారం

ప్రభాకర్ నేవీ బ్లూ టెరిలీన్ సూటులో దేవానంద్‌లా వున్నాడు. ఏమిటో రోజురోజుకీ ఆయన అందం పెరుగుతున్నదా అనిపిస్తున్నది. ఎందుకు ఆయనంటే - నాకు అంత ఇష్టంగా వుంటున్నదో అర్థం కావటం లేదు - కొంపతీసి నాకు తెలియకుండానే ఆయన్ని ప్రేమించటం లేదుకదా! ఆయన అందానికి దాసోహం అవటం లేదుకదా! ఛాఛా - అదేంకాదు - అన్నట్టు ఈ కాలేజీలోనే ఒక బ్రహ్మచారి లెక్చరర్ నుంచి నాకు ఆఫర్ వచ్చినట్టు తెలిసింది. ఇంకా నాన్న వివరాలు వ్రాయలేదు. ఒకవేళ తెలుగు సినిమాలో లాగ, ఇతనే అతనయితే... నేను నిజంగా అదృష్టవంతురాల్నే!

## 28 - బుధవారం

నా పుస్తకాల్లోకి ఎలా వచ్చిందో ఒక ప్రేమలేఖ. నా ఖర్మకాలి అది సునంద చేతిలో పడింది. అసలే ఆడది! అందులోనూ సునంద! మరి అందరికీ నిముషాల్లో తెలియదూ! అయినా ఎవడో బాగానే వ్రాశాడు. పెద్ద కవి అయ్యే ఛాయలు కనపడుతున్నాయి.

"ఓ అనూ! నా ప్రియమైన అనూ! నన్ను ప్రేమించాననూ! పదో నెంబరు బస్సులో ఆ రోజు నువ్వు పారేసిన నవ్వు నాకు దొరికింది. కాని ఇంకో రూపంలో.

ఏమంటారు దాన్ని - అదే! లవ్వు ఏమిటి మరి! కలుగుతున్నది మోహం!

కాస్త ఇవ్వవూ! నీ ప్రేమ దాహం:-

-ఎవరు రాసుంటారబ్బా దీన్ని - గిరా-ఛా-25 అంగుళాల పాంట్లు వేసే గిరికి మోడరన్ లవ్ కూడా తెలుసా! మరి మూర్తా? ముందు బెంచీలో కూర్చుని శ్రద్ధగా తలవూపే మూర్తికి ఇంత తీరిక కూడానా -- ఇంతమందిలో ఎవరో ఎలా తెలుసుకోవటం--

## 29 - గురువారం

ప్రభాకర్ మా క్లాసును వదిలేసి - ఇంకో క్లాసు తీసుకోటానికి ప్రయత్నాలు చేసి - విఫలుడయాడని తెలిసింది. మమ్మల్ని చూసి అప్పుడే దడుచుకున్నాడా ఏమిటి?

నిర్మల ఎందుకో కొంచెం షాక్ తిన్నట్టు కనపడుతున్నది. సరోజ గట్టిగా అడిగితే కన్నీళ్లు

తుడుచుకున్నది - ఏమిటో ఆవిడ దుఃఖ కారణం -- ఖర్మకాలి తనూ ప్రభాకర్ ప్రే.....ధా -- సీతమ్మవారు (నిర్మలకి సునంద పెట్టిన పేరు) ప్రభాకర్‌ని ప్రేమించడమేమిటి? నా పిచ్చిగాని - - ఏమైనా సరే నేను ప్రభాకర్‌కి చెప్పాలి. నేను ఆయన్ని వివాహమాడటానికి సిద్ధంగా వున్నట్టు - కాని.... ఎలా?

## మార్చి 1 - శుక్రవారం

డిపార్టుమెంటల్ కాంప్‌కని ప్రొద్దునే అరకులోయకు వెళ్ళాం. అరకులోయ చాలా బావుంది. ఇంత అందమైన కొండ ప్రదేశాన్ని మన ప్రభుత్వం ఎందుకు డెవలప్‌చేయదో అర్థం కాదు. నీలగిరీస్, కొడై లాగ ఇది ఎప్పటికవుతుందో! ప్రభాకర్ ఒక్కడూ రంగు రంగుల బంతిచెట్ల మధ్య కూర్చుని ప్రకృతిని ఆస్వాదిస్తున్నాడు. సూర్యభగవానుడు తన అరుణ కిరణాలను - మనోహరంగా వెదజల్లుతున్నాడు. నీలికొండలు, పచ్చటి లోయలు -- ఇంత అందమైన ప్రకృతి కన్య ఒడిలో చక్కటి ప్రభాకర్. ఆయనతో తన ప్రేమని చెప్పుకోటానికదే మంచి సమయం. అందుకే వెళ్ళి ఆయన ప్రక్కనే కూర్చుంటూ, "ప్రకృతి చాలా బావుంది కదూ మాష్టారూ!" అన్నాను.

"అహ! ఆఁ! ఆఁ! అవును!" అన్నాడాయన కొంచెం గాభరాగా. అదే సుబ్రావ్ అయితే "ఆఁ! కానీ నీ కన్నానా!" అంటాడు. ఏమిటో మానవుడు ఇంత ఆడ భయస్థుడు. ఒక్కసారిగా పెద్దగాలివచ్చి - నా పమిటచెంగు ఆయన ముఖం మీద పడింది. ఆయన కెలాచెప్పాలీ విషయం? పచ్చని గడ్డిమీద - తెల్లగా మెరుస్తున్న ఆయన చేతి మీద నా చేయి వేశాను. అప్రయత్నంగా "నేను మిమ్మల్ని ప్రేమిస్తున్నాను" అందామనుకున్న నా మాటలు ఎందుకో నోరు దాటి బయటికి రాలేదు! ఆయన చివ్వున లేచి, "మిస్ అనురాధా మీరు పెద్ద చదువులు చదువుకుంటున్నారు. క్షణికానందాలకోసం కాలు జారితే ఏమవుతుందో నేను వేరే చెప్పనవసరం లేదు ఈ వయసులో కొంచెం ఆలోచన అవసరం!" -- చక చకా వెళ్ళిపోయారు. ప్రేమని అర్థంచేసుకోలేక, ఏవో డైలాగులు చెప్పే ఆయన్ని ఎలా అర్థం చేసుకోవాలి? ప్రవరాఖ్యుడు కాదుకదా? ఆ రోజు అరకు నుంచి హాస్టల్‌కి వచ్చేసరికి అర్ధరాత్రయింది.

## 4 - సోమవారం

ఏదో పత్రికలో పడిన వైదేహి వుత్తరం కాలేజీ కుర్రాళ్ళలో పెద్ద కల్లోలమే రేపింది. "ఈ పురుగు మెంటాలిటీ అంతరించాలంటే ఆడవాళ్లు కొంచెం సభ్యంగా ప్రవర్తించాలి" అంటున్నాడు. రెడ్డి మూర్తితో, మమ్మల్ని చూడగానే గొంతు పెద్దదిచేస్తూ. వెయిటింగ్ రూమ్ (డిపార్టుమెంటు ఆఫ్ హస్కాలజీ)లో ప్రభాకర్ ప్రసక్తి వచ్చింది. ప్రభాకర్ అందగాడయినా - భయస్తుడనీ,

వెర్రిబాగులవాడనీ తేల్చారు చివరికి. ఎందుకో అతన్ని చూస్తే అందరికీ అంత ఈర్ష్య! బహుశా అందగాడనేమో -- ఈ సారి ఆయన్ని ప్రేమిస్తున్నట్టు స్పష్టంగా చెప్పాలి -- వీలుచూసుకొని-నాన్న దగ్గర్నుంచి ఉత్తరం ఇవాళ రాలేదు. ఆ లెక్చరర్ పెళ్ళి కొడుకు ఎవరో తెలిస్తే బాగుండును. ఈ సస్పెన్సుతో పరీక్షలకేం చదువుతాను నేను!

## 8 - శుక్రవారం

స్టాఫ్ రూంలోంచి హడావిడిగా వస్తున్న నిర్మల నన్ను చూసి చక చకా వెళ్ళిపోయిందెందుకో -- ఏమిటో వ్యవహారం - ఎవరికీ తెలియనివ్వదు కదా! ఇంగ్లీషు లెక్చరర్ ఆనందరావ్ - నన్ను చూసి అదోరకంగా నవ్వాడు. ఏదో వుంది కథ! కొంపతీసి నిర్మలకీ, ఆనందరావ్‌కీ - ఛా! నిర్మల మారీడ్ కదా!

## 9 - శనివారం

ఇవాళ సాయంత్రం బీచ్‌కి వచ్చాడు. ప్రభాకర్. ఒంటరిగా కూర్చుని ఆ చేతిలోని ఇసుకని ఈ చేతిలోకి పోస్తూ, ఏదో ఆలోచిస్తున్నారు కాబోలు - నన్ను గమనించలేదు.

"గుడ్ ఈవినింగ్ సార్!" అనగానే వులిక్కిపడ్డారు.

"ఓ! మీరా!" అదోరకంగా అన్నారు.

"మీరాని కాదు అనురాధని" - అని ముళ్ళపూడి జోక్ వేద్దామనుకొని మానేశాను - ఆయన నవ్వడేమోనని ఏరకంగా ప్రారంభించాలో తెలియక, ఇసుకలో దూరి చటుక్కున మాయమవుతున్న - పీతల్ని చూస్తూ వూరుకున్నాను. కాసేపయిన తర్వాత ఆయన సడన్‌గా అడిగారు - "మీరు త్వరలో వివాహం చేసుకోబోతున్నారా?" అని. ఆయన కంఠంలో వణుకు సముద్రపు హోరులో కూడా స్పష్టంగా విన్పిస్తున్నది. ఏం సమాధానం యివ్వాలో తెలియక - అదోరకంగా తల వూపాను. కొంచెం సిగ్గుపడి నా మనసులోని ప్రేమను తెలియచేయడానికి అది మంచిసమయమని సంతోషించాను.

"మీరు నన్ను అపార్థం చేసుకోకుండా వుంటే - నేనోవిషయం చెబుతాను!" అన్నాడు ప్రభాకర్ సూటిగా.

"చెప్పండి" అన్నాను.

"మీ స్వవిషయం గురించి చర్చిస్తున్నందుకు మన్నించండీ! ఏదో ఆవేశంలో వుండి - ఏమి చేస్తున్నారో తెలియని వయసులో వున్నారు మీరు. ఇప్పుడు ఏమయినా పొరపాటు జరిగితే జీవితాంతం బాధపడాల్సి వస్తుంది. ఆలోచనాశక్తి వున్న మీకు - ఇంతకన్నా చెప్పనవసరంలేదు. చక్కగా పెళ్ళిచేసుకొని సుఖపడండి - మీరు కవ్వింపుగా చూస్తున్న చూపులు - మీ చేష్టలు

మొదటి నుంచీ గమనిస్తూనే వున్నాను. ఇటువంటి సమయం కోసమే ఇన్నాళ్లూ ఎదురుచూస్తున్నాను, వినండి - నాకు పెళ్ళయింది. నా భార్య ఎవరో కాదు. మీ క్లాస్‌మేటే. ఏదో కారణాలవల్ల, మేము కాపురం ప్రారంభించకముందే -- వేరు పడ్డాం. ఇప్పుడవన్నీ సానుకూలపడ్డాయి, మాకు శుభదినాలు రాబోతున్నాయి. ఇంకో విషయం - ఇంగ్లీషు లెక్చరర్ ఆనందరావు మిమ్మల్ని వివాహం చేసుకోడానికి సిద్ధంగా వున్నారు. మీ నాన్నగారు ఆనందరావ్ ఫాదర్‌తో అన్ని విషయాలు మాట్లాడారుట! ఆనంద రావ్ చాలా బుద్ధిమంతుడు. అందగాడు. విష్ యు ఎ గుడ్ అండ్ హేపీ మారీడ్ లైఫ్!" ఇసుకలో పెద్ద పెద్ద అడుగులు వేస్తూ వెళ్ళిపోయాడు ప్రభాకర్.

నాకు ఒక నిమిషం నోట మాట రాలేదు.

ఇంకా నయం! నన్ను పెళ్ళి చేసుకోమని అడిగాను కాదు.

## 11 - సోమవారం

ప్రభాకర్ పాఠం చెబుతుంటే... నేను తలెత్తి ఆయన్ని చూడలేకపోయాను. నిర్మల తనలో తానే ముసి ముసి నవ్వులు నవ్వుకుంటున్నది. వైదేహి, సునంద, సరోజ అదే పత్రికలో తమ లేఖకి జవాబుగా అంతమంది అబ్బాయిలు వ్రాసిన జవాబు చదివి, చిర్రుబుర్రు లాడుతున్నారు.

క్లాస్ అయిన తరువాత - పెళ్ళి అయిన నిర్మల స్కూటర్ మీద - పరాయి మొగవాడు ప్రభాకర్ వెనకాల కూర్చుని - అతని నడుము మీద చేయి వేసి ఇంటికి వెళ్ళటం అందరికీ ఆశ్చర్యంగానే వుంది. తనకి తెలుసు .... నిర్మల గడ్డురోజులు తీరిపోయినాయి అని...... ●

*(ఆంధ్రజ్యోతి సచిత్రవార పత్రిక: సెప్టెంబర్ 13, 1968)*